క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు లేవని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం కేంద్రాన్ని సందర్శించి నివేదికను ఇవ్వాలని స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ కేంద్రాన్ని సందర్శించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఇతరత్రా సౌకర్యాల గురించి పాఠశాల యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నివేదికను ఆర్ఓకు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయండి

నేలకొండపల్లి: ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కో-కన్వీనర్ వంగూరి ఆనందరావు కోరారు. గువ్వలగూడెంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొట్టపింజర బాలస్వామి, వంగూరి మహేశ్వరరావు, జిల్లపల్లి నాగేశ్వరరావు, సరోజిని, వెంకటేశం, ధనమ్మ, కోటమ్మ, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ



కరాటేలో శిక్షణ పొందుతున్న బాలికలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో బాలికలకు వారి ఆత్మ రక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. గురువారం పాఠశాలలోని బాలికలందరికీ కరాటేలో గల నైపుణ్యాలు, మెళకువలపై శిక్షకుడి ద్వారా శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు.

ఓటు హక్కుపై కళాజాతా..



కళాప్రదర్శన ఇస్తున్న కళాకారులు

నేలకొండపల్లి: ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎస్.శ్వేత సూచించారు. మండలంలోని అజయ్‌తండాలో గురువారం ఓటు హక్కుపై కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని, నూరు శాతం పోలింగ్ అయ్యేలా సహకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరి, బీఎల్ఓలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	లియో
వినోద	భగవంత్ కేసరి
సాయిరాం	కీడా కోలా
ఆదిత్య	మా ఊరి పొలిమేర 2
శ్రీనివాస	టైగర్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	40	చుక్కకూర	3
బోడ కాకర	80		20
బీర	46	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	86		10
గోరుచిక్కుడు	30	మెంతికూర	3
క్యాబేజీ	38		20
క్యాలీఫ్లవర్	20	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		20
చామగడ్డ	38	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	40	-ఖమ్మం వ్యవసాయం	

నామినేషన్లకు వేళాయె..





కేఎంసీ (ఇన్‌సెట్) ఎన్నికల నామినేషన్ పత్రాలు దాఖలు చేసే ఆర్ఓ కార్యాలయం

నేటి నుంచి 10వ తేదీ వరకు స్వీకరణ

- కేఎంసీలోని ఆర్ఓ చాంబర్‌లో స్వీకరించనున్న అధికారులు
- రోజూ ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు గడువు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో కేఎంసీ ఆవరణ ఆర్ఓ చాంబర్
- వివరాలు వెల్లడించిన ఆర్ఓ ఆదర్శ్

ఖమ్మంమయూరిసెంటర్: సార్వత్రిక ఎన్నికలు-2023కు సంబంధించి నోటిఫికేషన్ శుక్రవారం (3వ తేదీన) విడుదల కానుందని, ఫామ్-1 కూడా విడుదలవుతుందని, అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరణ ఉంటుందని ఖమ్మం ఆర్ఓ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం ఆదర్శ్‌సురభి సాక్షితో మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లు వివరించారు. కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మొదటి అంతస్తులోని ఆర్ఓ చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి నామినేషన్ల పత్రాలు ఆర్ఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, అడిగిన అభ్యర్థులకు వీటిని పంపిణీ చేస్తామన్నారు.

పటిష్ట బందోబస్తు..

పోలీస్ శాఖ నుంచి నోడల్ అధికారిగా ఉన్న ఏసీపీ ఆధ్వర్యాన బందోబస్త్ ఉంటుందని, ఆర్ఓ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో బారికెడ్లను ఏర్పాటు చేసి బందోబస్త్ పర్యవేక్షిస్తారని తెలిపారు. కేఎంసీ కార్యాలయానికి సాధారణ సేవల కోసం వచ్చే ప్రజలను అనుమతిస్తామని, కానీ నామినేషన్ల దాఖల సమయాన వారి సేవలకు కొంత అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. వివిధ పనులకై కేఎంసీకి వచ్చే వారు ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 3 గంటల తర్వాత వచ్చి తమ పనులు చూసుకోవాలని సూచించారు. నామినేషన్ల దాఖలకు సంబంధించి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా.. ఇక్కడ సంప్రదించవచ్చన్నారు.

ఐదుగురికే ప్రవేశం..

నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే ఆర్ఓ చాంబర్‌లోకి ప్రవేశం ఉంటుందని ఆర్ఓ పేర్కొన్నారు. ఆర్ఓ చాంబర్‌తో పాటు కేఎంసీ కార్యాలయ ఆవరణమంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయని, నామినేషన్లు స్వీకరించే సమయాన వీడియో రికార్డ్ చేయబడుతుందని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే వారికి వెయింటింగ్ హాల్ ఏర్పాటు చేశామని, నామినేషన్ వేసేందుకు వచ్చే వారివి మూడు వాహనాలను మాత్రమే లోపలకు అనుమతిస్తామని, ఆర్ఓ కార్యాలయానికి వచ్చే రహదారులకు 100 మీటర్లలో గీతలు గీశామని చెప్పారు. సాధారణ ప్రజల వాహనాలు ఎక్కడా ఆపబోమని, నామినేషన్ వేసే అభ్యర్థితో వచ్చే వాహనాలను మాత్రమే ఆ గీతలకు బయట నిలిపివేస్తామని తెలిపారు.

రూరల్ తహసీల్‌లో నామినేషన్ల స్వీకరణ..

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్లను నేటి నుంచి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు స్వీకరించనున్నారు. ఇందు కోసం తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఓ రాజేశ్వరి తెలిపారు. నామినేషన్ వేసే కేంద్రం వద్ద అభ్యర్థులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రం ఎలా పూర్తి చేయాలి, ఇంకా ఏమైనా అనుమానాలుంటే హెల్ప్‌డెస్క్‌లో నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.



హెల్ప్‌డెస్క్‌లో ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్

అభివృద్ధిని చూసి ఆదరించండి...

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అజయ్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: జంట నగరాలకు దీటుగా ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేశానని, అభివృద్ధిని చూసి ఆదరించి తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని 45వ డివిజన్‌లో కెమిస్ట్-డ్రగ్గిస్ట్, బృందావనం గార్డెన్స్‌లో ఎంఎస్ఓ, కేబుల్ ఆపరేటర్స్ ఆధ్వర్యాన, 10వ డివిజన్ చైతన్యనగర్‌లో 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమాసతీష్, డివిజన్ అధ్యక్షుడు పాషా, వంగవీటి శ్రీను ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో పువ్వాడ పాల్గొని మాట్లాడారు. తాను ఇప్పటి వరకు నగరంలో ఎలాంటి వసూళ్లకు పాల్పడలేదని, బెదిరింపులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నగరాన్ని ఉంచుతున్నామని అన్నారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి వైపు ఉండి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణ, కార్పొరేటర్లు నీరజ, కర్నాటక్రిష్ణ, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పారుపల్లి రమేశ్, హరిగోపాల్, రమణ, కృష్ణరెడ్డి, చరణ్, నవీన్, నంద, మౌలాలి, సాహు, నర్సింహారావు, కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో గల 46వ డివిజన్ నుంచి కన్నం ప్రసన్న కృష్ణ ఆధ్వర్యాన మంత్రి అజయ్ కుమార్ సమక్షంలో 75 మంది యువత ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో జ్ఞానేశ్వర్, జాని, దోసపాటి రాజ, మారపాక సందీప్, షరీఫ్, నరేష్‌తో పాటు తదితరులు ఉన్నారు. అలాగే బీఆర్ఎస్ లీగల్ సెల్‌లో అడ్వకేట్ పోట్ల శ్రీకాంత్, బిచ్చాల తిరుమలరావుల ఆధ్వర్యాన దేవరకొండ కల్యాణి, దుర్గరాణి, రమ, కల్యాణి జ్యోతి, కల్యాణి రామంజమ్, ప్రవీణ్, మహేశ్, రామారావు, పురేటి జయరాజు, బురుగు శ్రీనివాస్, అద్దంకి మధు తదితరులు మంత్రి సమక్షంలో చేరారు.

అన్నదాన సేవాసత్రం ప్రారంభం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో శ్రీ ధర్మ శాస్త్ర అన్నదాన సేవ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన అయ్యప్ప దీక్ష స్వాములకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మేకల హనుమంతరావు, 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి సతీష్, పొన్నం వసంత్, అట్లూరి మధు, పుల్లం రాజు, వల్లభనేని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చా..

పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి/నేలకొండపల్లి: గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానని, తిరిగి మరోమారు ఎమ్మెల్యేగా బరిలో నిలుస్తున్న తనను గెలిపించాలని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరో వచ్చి మాయమాటలు చెబితే నమ్మొద్దని, మీకు నమ్మకం ఉన్న వారినే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కూసుమంచి: భగవత్‌వీడులో మాట్లాడుతున్న కందాళ

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక..

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురం ఎంపీటీసీ కె.సుశీల-నరసింహారావు, చెరువుమాధారం మత్స్య సొసైటీ చైర్మన్ ఎండీ.ఖాసీం, నేలకొండపల్లిలో నాయీబ్రాహ్మణులు 16 కుటుంబాలు కందాళ సమక్షంలో బీఆర్ఎస్ చేరారు.

కాంగ్రెస్ ఎప్పుడూ బలహీనంగా లేదు..

పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కామేపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కామేపల్లి/ఖమ్మంరూరల్/నేలకొండపల్లి/కూసుమంచి: రాష్ట్రంలో కాంగ్రెస్ ఎప్పుడూ బలహీనంగా లేదని, కాంగ్రెస్ బలహీనం కావడానికి కారణం నాయకులే అని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈక్రమంలో కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలోపొంగులేటి శ్రీనివాసరెడ్డిని గిరిజన యువకులు కలిసి ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌ను ఎస్టీ లంబాడీలకే కేటాయించాలని కోరగా.. టికెట్ సంగతి అధిష్టానం చూసుకుంటుందని వారికి పొంగులేటి సర్ది చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఆరు గ్యారంటీలను వివరించారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురంకు చెందిన సీపీఐ జిల్లా సహాయ కార్యదిర్శ దండి సురేశ్‌ను కలిసి తనకు సీపీఐ సహకారం కావాలని, భవిష్యత్‌లో తాను అండగా ఉంటానని తెలిపారు. అలాగే పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా.. తెల్దారుపల్లిలో మాట్లాడుతూ.. తమ్మినేని కృష్ణయ్య ప్రజల మన్ననలు పొందిన నాయకుడని, ఆయన ఆశయాలను నెరవేర్చుదామని తెలిపారు. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి పొంగులేటి మాధురి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ ఎడవెల్లి ముత్తయ్య, ఎంపీటీసీ బానోత్ సుజాత, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్, నాయకులు మిడకంటి పెదవెంకటరెడ్డి, వెంపటి సురేందర్, అనిల్ రెడ్డి, ఎండీ హఫీజుద్దీన్, రవికుమార్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక..

ఖమ్మరూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన ఎంపీటీసీ తమ్మినేని మంగతాయారు, తమ్మినేని నవీన్‌తో కలిపి 450 కుటుంబాలు, కామేపల్లి మండలం జగన్నాథతండాకు చెందిన 20 కుటుంబాల వారు పొంగులేటి సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే , నేలకొండపల్లి మండలం రాయగూడెంలో ఉప సర్పంచ్ గోగుల ఈశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ సూరేపల్లి రామారావు, నేలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్ తీగ రమణయ్య, లక్కా రామారావు తదితరులు కాంగ్రెల్‌లో చేరారు. ఈకార్యక్రమాల్లో ఖమ్మం మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా నాయకుడు మద్దినేని రమేష్‌బాబుతో పాటు గింజల నర్సింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారయణ, గోపిరెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాను దర్శించుకున్న 'వద్దిరాజు'



సాయిమందిరంలో పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలకేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా సేవాశ్రమాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జ్ఞాన సాయి మందిరంలోని బాబా విగ్రహం, స్తూపం, మందిరాన్ని సందర్శించగా.. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గ్రానైట్ వ్యాపారవేత్త వద్దిరాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సభ విజయవంతానికి ప్రచారం..

రఘునాథపాలెం: ఖమ్మంలో ఈనెల 5న తలపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచార పర్యటనను విజయవంతం చేయాలని గురువారం మండలంలోని మంచుకొండలో బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. గ్రామ ఎన్నికల ఇన్‌చార్జ్ నూతలపాటి మధు ఆధ్వర్యాన నాయకులు మందడపు నరసింహారావు, సుధాకర్, మాధవరావు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం సాగించారు. గ్రామానికి 10 బస్సుల ద్వారా 1,000 మంది తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, గంధసిరి వీరభద్రం, పార్టీ అధ్యక్షుడు భూక్యా రామునాయక్, ఉపసర్పంచ్ రమేశ్, తేజావత్ శంకర్, లాలు, భిక్షం, సైదులు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



మంచుకొండలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

బీఆర్ఎస్ మాయమాటలతో మోసపోకండి..



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ మాయమాటలతో మోసం చేస్తుందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఏపీఎస్ఐడీసీ మాజీ డైరెక్టర్, రైతు ఆత్మహత్యల నివారణ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జంజిరాల రాజేశ్ అన్నారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు బేడీలు వేసి జైలుకు పంపిన ఘనత బీఆర్ఎస్‌దేనని, రైతు రుణమాఫీ ఇంతవరకూ అమలు చేయలేదని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలు మీద తెచ్చుకున్న తెలంగాణలో కుటుంబపాలన, అవినీతి పాలనతో పీజీలు, డిగ్రీలు చదివిన యువత ఉద్యోగాలు లేక హమాలీలుగా, డ్రైవర్లుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10కి 10 సీట్లు కాంగ్రెస్‌వే అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కామా అశోక్ పాల్గొన్నారు.

జాబిల్లి హోమ్స్ బ్రోచర్లు ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరణలో మాట్లాడుతున్న సంస్థ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీ జయవిలాసిని డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వారి జాబిల్లి హోమ్స్ బ్రోచర్లను గురువారం ఖమ్మంలో ఆవిష్కరించారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధినేత కుంచపు రాంబాబు ఈ బ్రోచర్లను ఆవిష్కరించి సంస్థ అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జానిమియా, కాట్రపల్లి నాగరాజు, సంస్థ డైరెక్టర్లు శ్రీకాంత్, జి.రామారావు, టి.రామకృష్ణారెడ్డి, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

రఘునాథపాలెం: నిత్యం చోటు చేసుకుంటున్న సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండాల్సిన అవసరం ఉందని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఓ.శంకర్ పేర్కొన్నారు. గురువారం సైబర్ నేరాలపై మండలంలోని వేపకుంట్ల పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఐ కార్డులు, ఫేస్‌బుక్, ట్విట్టర్, డెబిట్ కార్డులు, మేసేజ్ తదితర వాటితో జరుగుతున్న నేరాల తీరు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. ఎవరైనా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఏదైనా సమాచారం అడిగితే చెప్పొద్దని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్

ఆరు గ్యారంటీలతో అందరికీ మేలు..

ఆత్మీయ సమ్మేళనాల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలతో అందరికీ మేలు జరుగుతుందని, అటువంటి పథకాలు పొందడానికి ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓట్లు వేసి కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని మాజీ మంత్రి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కేతినేని కృష్ణారావు ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నెల రోజులు కష్టపడితే.. తర్వాత ఐదేళ్ల పాటు మీ కోసం సేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, యర్నేని రామారావు, కార్పొరేటర్ చావా మాధురి, నారాయణరావు, నాగండ్ల దీపక్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్...

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కార్పొరేషన్ 9వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్ షేక్ జాన్‌బీ నాగుల్ మీరా గురువారం తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మాకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన తుమ్మల వెంటే తాము ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేశ్‌రెడ్డి, కమర్తపు మురళి, బిక్కసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యాలయం ప్రారంభం

కామేపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు మండలాధ్యక్షుడు జర్పుల రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అభ్యర్థి రవీందర్‌నాయక్ హాజరవుతారని చెప్పారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూల్చిన చోటే వేదిక నిర్మించాలి...

ఖమ్మంవన్‌టౌన్: ఈ నెల 5న ఖమ్మంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభ కోసం ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ పీజీ కళాశాల మైదానంలో ఎప్పటి నుంచో ఉన్న వేదికను తొలగించారని, దానిని సభ అయిన వెంటనే నిర్మించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోశ్, కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్‌లు డిమాండ్ చేశారు. కళాశాలలో ఎన్నో సభలు జరిగాయని, వాటికి రాని అడ్డురాని వేదిక ఒక్క బీఆర్ఎస్ సభకే అడ్డురావడం విడ్డూరంగా ఉందన్నారు. కూల్చివేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసి త్వరితగతిన నిర్మించేలా చర్యలు చేపట్టేలా కోరతామన్నారు. తొలగిస్తున్న విషయం తెలుసుకుని కళాశాలకు వచ్చిన నాయకులతో టూటౌన్ సీఐ కుమారస్వామి మాట్లాడారు. ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.



కాంగ్రెస్, పీడీఎస్‌యూ నాయకులతో మాట్లాడుతున్న టూటౌన్ సీఐ కుమారస్వామి